క్లుప్తంగా

కార్మికులకు ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలి

తాడేపల్లి రూరల్: మంత్రి నారా లోకేష్ ఎన్నికల ముందు ఏసీసీ సిమెంట్ ప్యాక్టరీ కార్మికులకు ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని యూనియన్ నాయకులు కూరపాటి స్టీవెన్ కోరారు. ఆదివారం తాడేపల్లి పట్టణ పరిధిలోని బ్రహ్మానందపురంలో ఏసీసీ సిమెంట్ ప్యాక్టరీ కార్మికులు నిర్వహిస్తున్న దీక్షా శిబిరాన్ని సందర్శించి కార్మికులకు మద్దతు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కార్మికులు తమకు రావాల్సిన బకాయిల కోసం న్యాయ పోరాటం చేస్తున్నారని అన్నారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి కార్మికుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎం.సాంబశివరావు, సుబ్బారావు, నవనీతం, రమణ, శారద, హగ్గయ్య, గురవయ్య, దుర్గా భవాని, రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

చిన్నారులకు సమ్మర్ క్యాంప్



తాడేపల్లి రూరల్: ఎంటీఎంసీ పరిధిలోని తాడేపల్లి చిగురు గ్రామం బోస్కో లెర్నింగ్ సెంటర్ చిన్నారులకు ఆదివారం నవజీవన్ బాలభవన్ ఆధ్వర్యంలో సమ్మర్ క్యాంప్‌ను నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రోగ్రామ్ మేనేజర్ వసంత కుమారి మాట్లాడుతూ.. 2025 సంవత్సరానికి రెస్పాన్సిబిలిటీ అనే థీమ్‌ను ఎంచుకుని చిన్నారులకు డ్యాన్స్, చైల్డ్ రైట్స్, బాల్య వివాహాల నిర్మూలనపై అవగాహన కల్పించామని తెలిపారు. అనంతరం పిల్లలకు స్కూల్ బ్యాగ్‌లు, బెడ్‌షీట్లు అందజేశామని పేర్కొన్నారు. కార్యక్రమంలో డాక్యుమెంటేషన్ ఇన్‌చార్జి శ్రవణ్‌కుమార్, నర్స్ సునీత, లెర్నింగ్ సెంటర్ టీచర్లు అనుష్క, లలిత, దుర్గ, పెద్దింట్లమ్మ, రాజ్యలక్ష్మి, నవజీవన్ వాలంటీర్ ఏంజెల్, పారేప్ర, అన్నె, లూకా తదితరులు పాల్గొన్నారు.

కార్మెల్ మాతకు విశ్వాసుల ప్రార్థనలు

ఫిరంగిపురం: మండల కేంద్రంలోని కార్మెల్ కొండపై కొలువైన కార్మెల్ మాతను దర్శించుకునేందుకు ఆదివారం పలు ప్రాంతాల విశ్వాసులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. కార్మెల్ కొండను ఎక్కి తలనీలాలు సమర్పించారు. కార్మెల్ మాతను దర్శించుకొని కొవ్వొత్తులు వెలిగించి మొక్కులు చెల్లించుకున్నారు.

శ్మశాన వాటికలో జూదం

తాడేపల్లి రూరల్: ఉండవల్లి శ్మశాన వాటికలో నిర్వహిస్తున్న జూద స్థావరంపై తాడేపల్లి పోలీసులు ఆదివారం దాడి చేశారు. ఈ దాడిలో 10 మంది జూదరులను అరెస్ట్ చేశారు. ఎస్‌ఐ ఖాజావలి మాట్లాడుతూ.. ఉండవల్లి హిందూ శ్మశాన వాటికలో గుట్టుచప్పుడు కాకుండా జూదం ఆడుతున్నారన్న సమాచారం మేరకు సిబ్బందితో దాడులు చేశామని అన్నారు. జూదరుల నుంచి రూ.13,500 నగదును స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే పీడీ యాక్ట్

మంగళగిరి టౌన్: శాంతి భద్రతలకు ఎవరైనా భంగం కలిగించేలా వ్యవహరిస్తే వారిపై పీడీ యాక్ట్ కింద కేసు నమోదు చేస్తామని మంగళగిరి పట్టణ సీఐ వినోద్‌కుమార్ హెచ్చరించారు. మంగళగిరి పట్టణ పరిధిలోని బాప్టిస్ట్‌పేటకు చెందిన బుల్లా మనోజ్(సన్ని) పై పిడియాక్ట్ కింద కేసు నమోదు చేసినట్లు వినోద్‌కుమార్ ఆదివారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గుంటూరు జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్ భార్గవ్ తేజ, జిల్లా ఎస్పీ సతీష్ కుమార్ ఆదేశాల మేరకు గతంలోనూ కేసులున్న మనోజ్‌ను రాజమండ్రి కేంద్ర కారాగారానికి తరలించినట్లు తెలిపారు. మాదకద్రవ్యాల రవాణా, కొట్లాటలు, దొంగతనాలు, అత్యాచారాలు, దోపిడీలు, హత్యాయత్నాల వంటి కేసుల్లో పదేపదే పోలీస్ రికార్డుల్లోకి నమోదైతే పీడీ యాక్ట్ చట్టం ప్రయోగిస్తామని అన్నారు. ప్రజా జీవనానికి ఆటంకం కలిగించేలా ఎవరైనా ప్రవర్తిస్తే శిక్ష అనుభవించక తప్పదని హెచ్చరించారు.

కమ్యూనిటీ హాల్‌కు శంకుస్థాపన



రావెల(తాడికొండ): మండలంలోని రావెల గ్రామంలో రూ.40 లక్షలతో నిర్మించనున్న బీసీ కమ్యూనిటీ హాల్‌కు కేంద్ర మంత్రి పెమ్మసానీ చంద్రశేఖర్, స్థానిక ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్ కుమార్‌లు ఆదివారం భూమిపూజ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రాజధాని నిర్మాణం కోసం రైతులు అండగా నిలిచారని.. వారికి ప్రభుత్వం అండగా ఉంటుందని అన్నారు. కమ్యూనిటీ హాల్ రావెల గ్రామానికి కలగా మారిందని.. ఇందుకు దాత సూదనగుంట రాఘవేంద్రప్రసాద్, కళ్యాణి ప్రసాద్‌లు నిర్మించడం హర్షణీయమని తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ రావెల శైలజ, స్థానిక నాయకులు దగ్గుమల్లి శ్రీనివాసరావు, కొమ్మినేని రామచంద్రరావు, కోటేశ్వరరావు, గుణవర్ధనరావు తదితరులు పాల్గొన్నారు.

రోడ్లపై పారుతున్న మురుగు!

- డ్రైనేజీలు దెబ్బతినడంతో రోడ్లపైకి మురుగు నీరు
- సాయినగర్, బాపనయ్య నగర్ ప్రజల అవస్థలు
- నివాసాల మధ్య అధికమవుతున్న దుర్గంధం



బాపనయ్య నగర్‌లో రోడ్డుపై నిలిచిన మురుగు



మురుగు ఖాళీ స్థలంలోకి చేరడంతో తిష్ట వేసిన పందులు



డ్రైనేజీ శిథిలమవ్వడంతో రోడ్డుపైకి వస్తున్న మురుగునీరు

తాడేపల్లి రూరల్: మంగళగిరి తాడేపల్లి నగర పాలక సంస్థ పరిధిలోని రాజధాని ముఖ ద్వారమైన ఉండవల్లి సెంటర్‌లో పలు ప్రాంతాలు సమస్యల వలయంలో కొట్టుమిట్టాడుతున్నాయి. ఉండవల్లి సెంటర్ అమరావతి రోడ్డు నుంచి ఉండవల్లి హరిజనవాడ కరకట్ట వరకు.. అటు గుంటూరు ఛానల్ వరకు గల మధ్యలో ఉన్న బాపనయ్య నగర్, సాయి నగర్, జామాయిల్ తోట, అయ్యప్ప స్వామి ఆలయ ప్రాంతాల్లో మురుగు ఎటూ వెళ్లక రహదారులపైనే తిష్ట వేసింది. దీంతో అధిక దుర్గంధం రావడంతో పాటు రోడ్లపై ప్రయాణించేవారు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు.

మురుగు కాలువలు శిథిలం..

బాపనయ్య నగర్‌లో 2005-10 సంవత్సరంలో సీసీ రోడ్డు నిర్మాణాన్ని ఏర్పాటు చేశారు. ఆ రోడ్డు నిర్మించిన అనంతరం డ్రైనేజీని ఏర్పాటు చేశారు. అప్పటి నుంచి అక్కడ శరవేగంగా అభివృద్ధి చెంది బిల్డింగ్‌ల నిర్మాణం కూడా చేపట్టారు. అప్పుడు ఏర్పాటు చేసిన సీసీ రోడ్డుతో పాటు డ్రైనేజీలు ఇటీవల శిథిలమవ్వడంతో ఇళ్లల్లో వాడుతున్న మురుగు నీరు రోడ్డుపైకి వచ్చి నిలబడుతుంది. వర్షానికి ఆ మురుగు నీరు ఇళ్ల మధ్యకు చేరడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. సాయినగర్ నుంచి అయ్యప్ప స్వామి ఆలయానికి వెళ్లేందుకు గత ప్రభుత్వంలో మట్టి రోడ్డు నిర్మాణాలు చేశారు. అంతకు ముందే పంచాయతీగా ఉన్న సమయంలో అప్పటి అధికారులు డ్రైనేజీలను ఏర్పాటు చేశారు. కానీ ఆ డ్రైనేజీ వ్యవస్థ ఎత్తు, పల్లాలుగా ఉండడంతో మురుగు నీరు బయటకు వెళ్లే మార్గం లేక రోడ్లపైకి చేరుతోంది. డ్రైనేజీ కొన్నిచోట్ల ఆక్రమణలకు గురికావడంతో వర్షం పడిన సమయంలో మురుగు రోడ్డుపైకి రావడం, ఖాళీ స్థలాల్లోకి వెళ్లడంతో అక్కడ పందులు, గాడిదలు సంచరిస్తున్నాయి. దీంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని స్థానికులు వాపోతున్నారు.

సమస్యలను పరిష్కరించాలి..

ఉండవల్లి సెంటర్ మూడు బొమ్మల ఎదురుగా ఉన్న సీసీ రోడ్, జామాయిల్ తోటలో పలు రహదారులు, వంశీ టాలెంట్ స్కూల్ వెనుక భాగంలో 20 ఏళ్ల క్రితం నిర్మించిన సీసీ రోడ్లు, ఇప్పుడు నిర్మాణాలు ఎత్తుగా కట్టడంతో డ్రైనేజీ పూర్తిగా దెబ్బతింది. దీంతో చిన్నపాటి వర్షం పడినా మురుగు నీరు రోడ్డుపైకి వస్తోందని స్థానికులు అంటున్నారు. అధికారులు వెంటనే స్పందించి తమ సమస్యలను పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.

సహకార సంఘం భవన నిర్మాణ శంకుస్థాపన

తాడేపల్లి రూరల్: తాడేపల్లి పట్టణ పరిధిలోని సుందరయ్యనగర్, లీలా సుందరయ్య కళావేదిక సమీపంలో కార్మిక వినియోగదారుల సహకార సంఘం భవన నిర్మాణ శంకుస్థాపనను ఆదివారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన సీపీఎం నాయకులు కాట్రగడ్డ శివరామకృష్ణయ్య భవన శంకుస్థాపన చేసి మాట్లాడారు. కార్మిక వినియోగదారుల సహకార సంఘం ద్వారా స్థానిక ప్రజలకు లబ్ధి చేకూరుతుందని అన్నారు. సుందరయ్య నగర్‌తో పాటు బైపాస్ రోడ్‌లో ఉన్న 300 అపార్ట్‌మెంట్స్‌లోని ప్రజలకు విస్తృతమైన సేవలు అందించడానికి ఏర్పాట్లు చేయనున్నట్లు పేర్కొన్నారు. సీపీఎం సీనియర్ నాయకులు ఎస్.వెంకటరావు మాట్లాడుతూ.. ఎటువంటి లాభాపేక్షం లేకుండా హోల్‌సేల్ ధరలకే నిత్యావసర వస్తువులు, ఆర్గానిక్ పదార్థాలను అందజేస్తామని అన్నారు. కార్యక్రమంలో సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యులు వి.కృష్ణయ్య, చుక్కపల్లి తిరుమల రావు, హైకోర్టు న్యాయవాది వెంకటేశ్వర్లు, నాయకులు బూరుగ వెంకటేశ్వర్లు, జొన్న శివశంకరరావు, దొంతిరెడ్డి వెంకటరెడ్డి, జి.సుబ్బారెడ్డి, వేముల దుర్గారావు, మేరి, శ్రీనివాస్‌రెడ్డి, గిరిజ, సుబ్బారావు, భుజంగరావు పలు ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు.

చిన్నారులకు స్కూల్ బ్యాగులు పంపిణీ



చిగురు ఆశ్రమంలో చిన్నారులతో నాయకులు, కార్యకర్తలు

తాడేపల్లి రూరల్: తాడేపల్లి వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షులు బుర్రముక్కు వేణుగోపాల సోమిరెడ్డి జన్మదిన వేడుకలను పార్టీ నాయకులు, కార్యకర్తలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పలుచోట్ల పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు ఈదుల మూడి డేవిడ్ రాజు, సీనియర్ నాయకులు జక్కిరెడ్డి కృష్ణారెడ్డి, మంగళగిరి నియోజకవర్గ జేసీఎస్ మాజీ కన్వీనర్ మున్నంగి వివేకానందరెడ్డి ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలను నిర్వహించారు. మున్నంగి వివేకానందరెడ్డి సౌజన్యంతో పెనుమాక శివారులోని చిగురు ఆశ్రమంలో చిన్నారులకు స్కూల్ బ్యాగ్‌లు, పుస్తకాలు అందజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ఎస్సీ విభాగ ప్రధాన కార్యదర్శి ముదిగొండ ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు. మంగళగిరి రూరల్ పరిధిలోని పలు కార్యక్రమాల్లో పంచాయతీరాజ్ విభాగం గ్రీవెన్స్ సెల్ రాష్ట్ర అధ్యక్షులు ఈపూరి ఆదాము పాల్గొన్నారు. వృద్ధులు, చిన్నారులకు అల్పాహారం అందజేశారు. నియోజకవర్గం పరిధిలోని పలు సేవా కార్యక్రమాల్లో తమ్మా మహేష్, పులివర్తి రాంబాబు, కుంచాల కృష్ణ కిషోర్, మహిళా నాయకురాలు గుంటి రాజ్యలక్ష్మి, రాష్ట్ర సోషల్ మీడియా కార్యదర్శి, సంయుక్త కార్యదర్శులు మేకా వెంకటరామిరెడ్డి, షేక్ జావీద్, జిల్లా ఎస్టీ సెల్ అధ్యక్షులు మేడ వెంకటేశ్వరరావు(పండు), మంగళగిరి నియోజకవర్గ యువజన విభాగ అధ్యక్షులు మొహమ్మద్ గౌస్ మొహిద్దీన్, పట్టణ ఉపాధ్యక్షులు జీలగ పెదగాలయ్య, ఎస్టీ సెల్ అధ్యక్షులు చిలుకోటి మధు తదితరులు పాల్గొన్నారు.

పరమ పవిత్ర త్రైత సిద్ధాంత భగవద్గీత ప్రచారం



ప్రచారంలో పాల్గొన్న సభ్యులు

దుగ్గిరాల: ఆచార్య ప్రబోధానంద యోగీశ్వరులు వారు రచించిన 101 త్రైత సిద్ధాంత ఆధ్యాత్మిక గ్రంథాలు, భగవద్గీత ప్రచారాన్ని ఆదివారం నిర్వహించారు. దుగ్గిరాల మండలంలోని చింతలపూడి గ్రామంలో త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి ఇందూ జ్ఞాన వేదిక గుంటూరు కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో కార్యక్రమాన్ని నిర్వహించారు. కమిటీ అధ్యక్షుడు రౌతు శ్రీనివాసరావు మాట్లాడుతూ.. శ్రీ కృష్ణుడిని, భగవద్గీతని విశ్వసించడంతో జ్ఞానం, మోక్షం లభిస్తాయని అన్నారు. కార్యక్రమంలో టి.వి.కృష్ణారావు, ఆర్.రామకృష్ణ, ఎ.అన్నపూర్ణ, ఎ.సాత్విక, తదితరులు పాల్గొన్నారు.

ఆలయ అభివృద్ధికి విరాళం



దుగ్గిరాల: మండలంలోని కంఠంరాజుకొండూరు గ్రామంలో కొలువైన శ్రీ మహంకాళీ అమ్మవారిని ఆదివారం విజయవాడకు చెందిన ఎగ్గిన లక్ష్మీ కాంతారావు, శిరీష దంపతులు దర్శించుకున్నారు. అనంతరం అమ్మవారికి విశేష పూజలు నిర్వహించారు. ఆలయ అభివృద్ధికి దంపతులు రూ.10,116 విరాళాన్ని ఆలయ అర్చకులకు అందజేశారు. ఈవో కె.సునీల్‌కుమార్ దంపతులకు అర్చకుల ఆశీర్వచనాలను అందించారు.

షార్ట్ సర్క్యూట్‌తో పూరిల్లు దగ్ధం



పూర్తిగా కాలిపోయిన పూరిల్లు

దుగ్గిరాల: విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో పూరిల్లు పూర్తిగా దగ్ధమైంది. ఈ ఘటనలో సర్వం కోల్పోయిన బాధితురాలు కట్టు బట్టలతో బయట పడి ప్రాణాలు దక్కించుకున్నారు. దుగ్గిరాల మండలం మోరంపూడి గ్రామంలో ఆదివారం విద్యుత్ తీగల వల్ల మంటలు ఒక్క సారిగా చెలరేగడంతో పూరిల్లు పూర్తిగా దగ్ధం అయ్యింది. అందులో ఒంటరిగా నివాసం ఉండే 68 ఏళ్ల వృద్ధురాలు నల్లమామిడి లక్ష్మీ ప్రాణాలతో బయటపడ్డారు. ఇంట్లో ఉండే 5 సవర్ల బంగారం, రూ.4 లక్షల నగదు కాలి బూడిద అయ్యాయని బాధితురాలు తెలిపారు. చుట్టుపక్కల వారు మంటలు ఆర్పే ప్రయత్నం చేసినా ఫలితం లేకపోయింది.

డోకిపర్రులో పల్లెనిద్ర



మేడికొండూరు: మండల పరిధిలోని డోకిపర్రులో ఆదివారం మేడికొండూరు పోలీసులు డీఎస్పీ మురళీకృష్ణ ఆధ్వర్యంలో పల్లెనిద్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో డీఎస్పీ మాట్లాడుతూ.. అసాంఘిక కార్యక్రమాలపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసినట్లు ఆయన అన్నారు. తల్లిదండ్రులు పిల్లల విషయంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, పిల్లలను క్రమశిక్షణతో పెంచాలని, చరవాణికి దూరంగా ఉంచి పాఠ్య పుస్తకాలకు దగ్గర చేయాలన్నారు. మండలంలోని పలు గ్రామాల రౌడీ షీటర్లపై ఎప్పటికప్పుడు నిఘా ఉంటుందన్నారు. కార్యక్రమంలో మేడికొండూరు సీఐ నాగూర్ మీరా సాహెబ్, ఎస్సైలు ఖాజిబాబు, సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

సీపీఐ ఆధ్వర్యంలో సమైక్యతా యాత్ర



యాత్రలో పాల్గొన్న నాయకులు

తాడేపల్లి రూరల్: తాడేపల్లి పట్టణ పరిధిలోని బోసుబొమ్మ సెంటర్ నుంచి ముగ్గురోడ్డు సెంటర్ వరకు పలు పార్టీలు, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ఆదివారం సమైక్యతా యాత్ర నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన సీపీఎం గుంటూరు జిల్లా కార్యదర్శి వై.నేతాజీ మాట్లాడుతూ.. పహల్గాం ఘటన తర్వాత దేశ ప్రజలు మత సామరస్యాన్ని కోరుకుంటున్నారని అన్నారు. ఈ ఘాతుకానికి పాల్పడిన ఉగ్రవాదులను మట్టుపెట్టాలని దేశవ్యాప్తంగా ప్రజలు ముందుకు రావడం హర్షించదగ్గ విషయమన్నారు. దేశ సమైక్యత, మత సామరస్యాన్ని కాపాడాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని తెలిపారు. కార్యక్రమంలో పట్టణ కార్యదర్శి బూరుగ వెంకటేశ్వర్లు, సీపీఐ మంగళగిరి ఏరియా నాయకులు కంచర్ల కాశయ్య, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షులు దర్శనపు సామేలు, సీనియర్ నాయకులు జొన్న శివశంకరరావు, గాదె సుబ్బారెడ్డి, వేముల దుర్గారావు, మేరి, బాబూరావు, నాగేశ్వరరావు, బర్నబాస్, బాజ్జి, బాషా, సత్యం, పట్టణ సహాయ కార్యదర్శి వెంకటయ్య, మానికొండ డాంగే తదితరులు పాల్గొన్నారు.

రాజధాని పారిశుద్ధ్య కార్మికుల వేతనాలు పెంచాలి



కార్మికులతో నిరసన తెలియజేస్తున్న రవి

తాడికొండ: రాజధాని పారిశుద్ధ్య కార్మికుల వేతనాలను రూ.21 వేలకు పెంచాని రాజధాని ఏరియా పారిశుద్ధ్య కార్మిక సంఘం గౌరవాధ్యక్షుడు ఎం.రవి డిమాండ్ చేశాడు. ఈ సందర్భంగా తుళ్లూరులో పారిశుద్ధ్య కార్మికులతో కలిసి ఆయన నిరసన తెలియజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. రాజధానిలో పనిచేస్తున్న పారిశుద్ధ్య కార్మికులకు జీతం పెంచడంతో పాటు వారిని ఔట్‌సోర్సింగ్ కార్పొరేషన్‌లోకి తీసుకోవాలని అన్నారు. గతంలో నిలిపివేసిన సామాజిక పింఛన్‌ను వెంటనే పునఃరుద్ధరించాలని కోరారు. కార్మికులకు సమస్యల పరిష్కారం కోసం శుక్రవారం తుళ్లూరు గ్రీవెన్స్‌లో వినతిపత్రం, నిరసన తెలియజేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో రాజధాని ఏరియా పారిశుద్ధ్య కార్మిక సంఘం నాయకులు ఎల్.సుభవేణి, ఎల్.లక్ష్మీతిరుపతమ్మ, ఎస్.మేరి, ఎస్.శేషయ్య, ఎ.జోజి, వెంకటరమణ, పార్వతీ, సునీత, కె.మరియదాసు, విజయకుమార్, ఎస్.కోటేశ్వరరావు, వి.బుజ్జి, హేమ, బలరామ్ తదితరులు పాల్గొన్నారు.

మోదీ అవలంభిస్తున్న విధానాలను ప్రతిఘటించాలి



మాట్లాడుతున్న అజయ్‌కుమార్

మంగళగిరి టౌన్: కేంద్రంలో నరేంద్ర మోదీ అవలంభిస్తున్న ప్రజా, కార్మిక వ్యతిరేక విధానాలను ప్రతిఘటించాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు జంగాల అజయ్‌కుమార్ అన్నారు. మంగళగిరి నగర పరిధిలోని కొత్తపేటలో ఆదివారం సీపీఐ శాఖ మహాసభను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అధికారంలోకి వచ్చిన మోదీ నల్లధనాన్ని బయటకు తెస్తానని చెప్పి.. దానిని పెట్టుబడి దారీ వ్యవస్థకు తరలించిన ఘనుడని ఆగ్రహం వ్యక్తం చేశారు. రైతులు అప్పుల పాలై ఆత్మహత్యలకు పాల్పడుతున్నా కేంద్ర ప్రభుత్వానికి చీమకుట్టినట్లు కూడా లేదని ఆరోపించారు. కార్పొరేట్ సంస్థలకు మోదీ దోచిపెడుతున్నారని ఎద్దేవా చేశారు. ఆగష్టులో జరిగే మహాసభలపై చర్చించారు. అనంతరం నూతన కమిటీని ఎన్నుకున్నారు. కొత్తపేట శాఖ కార్యదర్శిగా వల్లభాపురం నాగేశ్వరరావు, సహాయ కార్యదర్శులుగా ఎస్.కె యాసిన్, రెబ్బా రామయ్య, కోశాధికారిగా నీలం కమలను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో నాయకులు ఎస్‌కె. సుభాని, చిన్ని తిరుపతయ్య, ప్రభాకర్, మేడా హనుమంతరావు, పిల్లలమర్రి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

సినిమాకు పరిశ్రమ హోదా కల్పించడం హర్షణీయం

సినీ దర్శకుడు దిలీప్‌రాజా



మాట్లాడుతున్న దిలీప్‌రాజా

తెనాలిఅర్బన్: సినిమాకు పరిశ్రమ హోదా కల్పిస్తూ కాంప్రహెన్సివ్ ఫిలిం డెవలప్‌మెంట్ పాలసీని రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టడం వలన ఎంతో మేలు జరిగే అవకాశం ఉందని మా ఏపీ వ్యవస్థాపకుడు, సినీ దర్శకుడు దిలీప్‌రాజా పేర్కొన్నారు. తెనాలిలోని మా ఏపీ కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ జూన్ 1 నుంచి ఎగ్జిబిటర్లు తలపెట్టిన సినిమా థియేటర్‌ల బంద్‌ను ఉపసంహరించుకోవడం హర్షణీయమన్నారు. సినిమా థియేటర్ల యాజమానుల ప్రమేయం లేకుండా లీజుకు తీసుకున్న ఆరుగురు ప్రముఖులు దీనివెనుక ఉన్నారనే ఆరోపణ చేశారు. ఇకపై ఎవరితోనూ వ్యక్తిగత సంప్రదించకుండా సినిమా సంఘాలతో చర్చలు జరుపుతామని ఉపముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ ప్రకటించడం శుభపరిణామన్నారు. సమావేశంలో నటులు మిలటరీ ప్రసాద్, వేమూరు విజయభాస్కర్, తదితరులు పాల్గొన్నారు.

నిందితుడిని కఠినంగా శిక్షించాలి

దుగ్గిరాల: వైఎస్సార్ కడప జిల్లాలో నాలుగేళ్ల చిన్నారిపై అత్యాచారానికి పాల్పడిన నిందితుడిని కఠినంగా శిక్షించాలని వైఎస్సార్‌సీపీ ముస్లిం మైనార్టీ సీనియర్ నాయకులు షేక్ సుభాని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. ఆదివారం దుగ్గిరాలలో మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. జమ్మలమడుగు నియోజకవర్గం, మైలవరం మండలం కంబాలదిన్నె గ్రామంలో నాలుగేళ్ల చిన్నారిపై అత్యంత దారుణంగా అత్యాచారం చేసి హత్య చేసిన నిందితుడిపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. ఇంతటి దుర్మార్గానికి పాల్పడిన నిందితుడిని వెంటనే శిక్షించాలని ఆయన డిమాండ్ చేశారు.

బైక్ రేసర్లపై ఉక్కుపాదం

5 రేస్ బైక్‌లను స్వాధీనం చేసుకున్న పోలీసులు



బైక్ రేసర్లకు కౌన్సిలింగ్ నిర్వహిస్తున్న పోలీసులు

మంగళగిరి: బైక్ రేస్‌లు నిర్వహించే యువకులపై కఠిన చర్యలు తీసుకుంటామని మంగళగిరి రూరల్ సీఐ వై.శ్రీనివాసరావు తెలిపారు. ఆదివారం వెస్ట్ బైపాస్, జాతీయ రహదారులపై తనిఖీలు నిర్వహించారు. బైక్ రేసులకు వెళుతున్న పలువురు యువకుల వాహనాలను అడ్డుకొని తనిఖీలు నిర్వహించారు. బైక్ రేస్‌లకు వాడుతున్న 5 బైక్‌లను స్వాధీనం చేసుకుని స్టేషన్‌కు తరలించారు. రేస్‌లో పాల్గొనే యువకులపై కేసులు నమోదు చేసి జరిమానాలు విధిస్తామని సీఐ తెలిపారు. ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి బైక్ రేసులను అరికడతామని అన్నారు. తనిఖీల్లో ఎస్‌ఐ సీహెచ్ వెంకట్, సిబ్బంది పాల్గొన్నారు.

ఆకట్టుకున్న ఛత్రపతి శివాజీ నాటక ప్రదర్శన



ఛత్రపతి శివాజీ మహారాజ్ నాటకంలో సన్నివేశం

తెనాలి: కళాసాహిత్యాల అఖిల భారతీయ సంస్థ సంస్కార భారతి, ఆంధ్రప్రదేశ్, సీబీఆర్ అకాడమీ ఆఫ్ స్పోర్ట్స్ అండ్ ఎడ్యుకేషన్ సంయుక్త నిర్వహణలో తెనాలిలో చారిత్రాత్మక నాటకం 'జయహో శ్రీఛత్రపతి శివాజీ మహారాజ్' ప్రదర్శించారు. స్థానిక కొత్తపేటలోని తెనాలి రామకృష్ణకవి కళాక్షేత్రమ్‌లో ఆదివారం రాత్రి ప్రదర్శించిన ఈ చారిత్రక నాటకం ప్రేక్షకులను ఆకట్టుకుంది. శివాజీ స్మారక సమితి, హిందూ చైతన్యవేదిక, సంయుక్తంగా ఈ ప్రదర్శనను ఏర్పాటుచేశారు. విజయవాడకు చెందిన డాక్టర్ రామన్ ఫౌండేషన్ వారి శ్రీసాయిబాబా నాట్యమండలి కళాకారులు 60 మంది నటులు పాత్రోచితంగా నటించారు. సంస్కార భారతి, ఆంధ్రప్రదేశ్ అధ్యక్షుడు డాక్టర్ పీవీఎస్ కృష్ణ రచించిన నాటకాన్ని ఆయన దర్శకత్వంలోనే ప్రదర్శించారు. హైదరాబాద్‌లోని సీబీఆర్ అకాడమీ ఆఫ్ స్పోర్ట్స్ అండ్ ఎడ్యుకేషన్ అధినేత చలసాని బలరామయ్య ప్రదర్శనా సహకారం అందించారు. తొలిసారిగా డిజిటల్ టెక్నాలజీతో ప్రదర్శించటం మరో విశేషం. ప్రారంభ కార్యక్రమంలో శివాజీ స్మారక సమితి గౌరవాధ్యక్షుడు డీఎల్ కాంతారావు, మాజీ మంత్రి నన్నపనేని రాజకుమారి, బీజేపీ నాయకురాలు యడ్లపాటి స్వరూపరాణి, హిందూ చైతన్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడు వెంగళరావు తదితరులు పాల్గొన్నారు. జూన్ 8వ తేదీన సాయంత్రం 4 గంటలకు తెనాలిలో శోభాయాత్రను నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా జనసమీకరణకు ఈ ప్రదర్శనను ఏర్పాటుచేశారు.

అలరించిన గానామృతం

తెనాలి: పట్టణానికి చెందిన సంగీత సంస్థ సంకీర్తన ఆధ్వర్యంలో ఆదివారం రాత్రి ఇక్కడి కొత్తపేటలోని అదితి గ్రాండ్ ఫంక్షన్‌హాలులో పదకవితా పితామహుడు తాళ్లపాక అన్నమాచార్య 617వ జయంతిని నిర్వహించారు. సంకీర్తన వ్యవస్థాపక అధ్యక్షుడు, ప్రముఖ పిల్లల వైద్యనిపుణుడు డాక్టర్ కె.పురుషోత్తమరావు ఆధ్వర్యంలో గాయనీగాయకులతో అన్నమయ్య కీర్తనలను భక్తిపారవశ్యంతో ఆలపించారు. డాక్టర్ పురుషోత్తమరావు అన్నమయ్య కీర్తనలను గానం చేసి, ఆహూతుల అభినందనలు అందుకున్నారు. వీరికి వయోలిన్‌పై గౌరావఝుల ఆంజనేయశాస్త్రి, కీబోర్డుపై నూతక్కి వెంకటేశ్వరరావు, మృదంగంపై కానూరి వెంకట రామకృష్ణ, తబలాపై పెరవలి వంశీకృష్ణ వాయిద్య సహకారం అందించారు. దాదాపు రెండు గంటలసేపు అన్నమయ్య కీర్తనల గానామృతంతో సంగీతాభిమానులను రంజింపజేశారు. సంస్థ కార్యదర్శి కె.రాజేశ్వరరావు పర్యవేక్షించారు.

యువత క్రీడల్లో రాణించాలి



తెనాలిటౌన్: యువత క్రీడల్లో ఉన్నతంగా రాణించాలని బీసీ సంక్షేమ సంఘ రాష్ట్ర అధ్యక్షుడు కేసన శంకరరావు పేర్కొన్నారు. స్థానిక వీఎస్సార్ అండ్ ఎన్వీఆర్ కళాశాలలో నిర్వహిస్తున్న కేసీఎల్ క్రికెట్ లీగ్ మ్యాచ్‌ను ఆదివారం ఆయన సందర్శించారు. తెనాలిలో గత 10 సంవత్సరాలుగా కావేటి యలమందరావు స్మారకార్థం క్రికెట్ టోర్నమెంట్ ఏర్పాటు చేసి యువతను అందులో భాగస్వాములు చేయడం అభినందనీయమని కొనియాడారు. విజేతలకు మెమెంటో బహుకరించారు. అమిరినేని రాజా, కావేటి వేణుగోపాల్, కోలా అశోక్, పాశం వెంకటేష్, మణికంఠ, సుమన్, నరసింహా, కోలా వాసు, రాజేష్, సాంబయ్య, రామారావు, వేణు, తదితరులు ఉన్నారు.